**గమనంలో అనుకోని మార్పులు రావడంతో ముందుగా నిర్ణయించుకున్న గమ్యాన్ని చేరలేకపోవడం మానవులకు కొత్తేమీ కాదు. రాజ్యరహితమైన స్థితికి చేరటానికి మార్క్సిజమనే మార్గంలో చిత్తశుద్ధితోనే ప్రయాణం చేసినవాళ్లు, దారిలో యెదురైనమార్పులకూ, విభజనలకూ అతలాకుతలమై పోయారు. యిలా పెనుమార్పులు జరిగిపోయిన ప్రపంచానికి చిన్న ప్రతీకగా (Microcosm) వున్న యిండ్లలో సావిత్రి గారిదొకటి.**

మధురాంతకం నరేంద్ర

5

# సావిత్రి యిల్లు

చారి పి.ఎస్.





చేతులకూ, నోటికీ, ముక్కుకూ రకరకాల రంగుగొట్టాలు వేలాడుతున్న సన్నటి పొడవాటి బక్కచిక్కిన శరీరాన్ని సావిత్రిగా గుర్తించడం చాలా కష్టమయిందామెకు. పూలూ ముళ్లతోబాటు విరిగి, వాడి, యెండిన చెట్టు కొమ్మలాగుందామె.

దిగులుగా నిట్టూరుస్తూ వార్డు గదిలోంచి బయటికొస్తూండగా, "మేడం మీకేవవుతారు?" అని అడిగింది నర్సు.

"కజిను... మా పిన్ని కూతురు," అంటూ వో అబద్ధాన్ని చకచకా చెప్పేశాక, "యెన్నాళ్ల నుంచీ యిలా?" అని అడిగిందామె.

"నాలుగు నెలలు దాటాయి. మీరే మొదటి విజిటరు," అంది నర్సు.

"అదేమిటి? కొడుకూ, కూతురూ రాలేదా?" విస్తుపోయిందామె.

నర్సు ఫైలు తిప్పుతూ, "వాళ్లనుగూడా విజిటర్సు కిందే చేర్చాలి లెండి. మొదట్లో రెండు మూడుసార్లొచ్చి పోయారు..." అంది.

హాస్పిటల్లోంచి బయటికొచ్చి ఆటో యెక్కిందామె. యిలా యీ వూర్లో బాహాటంగా తిరగడం సాధ్యంగాని పాతరోజులు గుర్తుకొచ్చాయామెకు. యెప్పుడు తలదాచుకోవాలన్నా సందేహించకుండా, యీ వూరొచ్చి, సావిత్రి యింటిని చేరుకోవడం జ్ఞాపకమొచ్చింది. యిన్నేళ్ల తర్వాత, యిన్ని మార్పుల తర్వాత కూడా ఆశ్రయాన్ని వెతుక్కుంటూ మళ్లీ సావిత్రి దగ్గరికే వచ్చింది తాను. కానీ యిప్పుడామె హాస్పిటల్లో...

సావిత్రి అద్దె యింట్లో వున్నప్పుడు కూడా యీ వూరొచ్చింది తాను. అప్పుడు చాలాసార్లు చాలారోజులపాటు ఉండిపోయింది. ఆమె స్వంత యిల్లు కట్టుకున్న తర్వాత మాత్రం వోసారి హడావుడిగా వెళ్లిపోవలసి వచ్చింది. గోదావరి జిల్లాల్లో ఆఫీసర్ల కిడ్నాపులూ, యిక్కడ దగ్గర్లో లాండ్‌మైన్ పేలుడులో జీపొకటి ధ్వంసంగావడం, పోలీసుల గాలింపులు పెరగడం- అప్పుడుగూడా సావిత్రి మాటవరసకైనా వెళ్లిపోమనలేదు. ఆమె పర్వాలేదని వారిస్తున్నా తానే వెళ్లిపోయింది.

ఆటో యింటి ముందు ఆగింది. ప్రహరీ పక్కన చెట్లేవీ లేవు. లోపల వరండా మెట్లపైన పూలకుండీలూ లేవు. బోసిగావున్న ప్రహరీ గోడకు 'అనిల్-వందన' అనే పేర్లున్న రాతిఫలకం మాత్రం కొత్తగా చేరింది. వరండా యినపగ్రిల్ తలుపులకల్లిన చిక్కటి యినప 'మెష్'

లోంచి యింటిలోపల చీకటి మాత్రమే కనిపిస్తోంది. బాగా మాసిపోయిన కాలింగ్ బెల్‌ను నొక్కిందామె.

రెండుసార్లు బెల్ నొక్కిన తర్వాత తలుపులు తెరుచుకున్నాయి. చీమిడి కారుస్తున్న చంటిపిల్ల నెత్తుకున్న యువతి విసుగ్గా చూస్తోంది.

"నేను అనసూయ... సావిత్రి నా కజిను," అని పరిచయం చేసుకుందామె. ఆ యువతి అయితే యేమిటన్నట్టుగా చూస్తోంది.

అనసూయ చొరవగా ముందుకో అడుగేసి, "అనిల్ లేడా?" అని అడిగింది.

"లేడు. ఆఫీసు... అట్నే హరేరామ హరేకృష్ణ గుడికెళ్లి..."

వరండాలోని ప్లాస్టిక్ కుర్చీలో కూచోబోతున్న అనసూయ అలాగే ఆగిపోయి, "గుడికా?" అని పెద్దగానే అరిచింది. తర్వాత, "వచ్చేదాకా వెయిట్ చేస్తాన్లే... నువ్వు అనిల్ భార్యే గదా! నీ పేరు..." అని అడిగింది.

"విష్ణువందన," అందా యువతి బిక్కమొహమేసుకుని.

ప్రహరీగోడపైని రాతిఫలకాన్ని గుర్తు చేసుకుంటూ, "కొంచెం నీళ్లిస్తావా వందనా?" అంది అనసూయ చొరవగా.

నుదుటిపైన కారుతున్న చెమటను మసిబారిన పయిటతో తుడుచుకుంటూ, యేడవబోతున్న పాపాయిని హత్తుకుంటూ, తక్కుతూ తారుతూ లోపలికెళ్లింది వందన.

వరండా గోడపైన పెద్ద వెంకటేశ్వరుడి ఫోటోకు ప్లాస్టిక్ పూలమాల వేలాడు తోంది. అక్కడొకప్పుడు కారల్‌మార్క్సు ఫోటో వుండేదని అనసూయకు జ్ఞాపకం వచ్చింది.

రాగిగ్లాసుతో నీళ్లు తీసుకొచ్చింది వందన.

"అనిల్ రావటం లేటవుతుందేమో! ఈలోగా కప్పు కాఫీ..." అంది అనసూయ.

"మా యింట్లో కాఫీపొడి ఉండదు. పాలు... లేకపోతే హార్లిక్సు..."

యిదే యింట్లో వొకప్పుడు ఫిల్టర్‌లో కాఫీ డికాషను యిరవై నాలుగ్గంటలూ సిద్ధంగా వుండేది, అనుకొంది అనసూయ.

"హార్లిక్సే బెటరు," అంది కాలాన్ని గడిపే మిష కోసం వెతుక్కుంటూ.

రాగం తీస్తున్న పాపాయితోబాటు వందన లోపలికెళ్లింది.

కాస్సేపయ్యాక పైకిలేచి విసుగ్గా వొళ్లు విరుచుకుని, హాల్లోకి తొంగిచూసింది అనసూయ. యెప్పుడో సావిత్రి కొనుక్కొచ్చి వేసిన పేముకుర్చీలూ, పేము సోఫా, అలాగే ఉన్నాయి. ఓ వైపు గోడపైన ఫోటోలో కృష్ణుడు అర్జునుడికి భగవద్గీత బోధిస్తున్నాడు. మరోవైపు గోడకు కోపంగా చూస్తున్న మీసాలదేవుడి పటమూ వున్నాయి. హాల్లో పిల్లల బొమ్మలు చిందరవందరగా పడి వున్నాయి. వొకప్పుడు శుభ్రంగా తీర్చిదిద్దినట్టుండే హాలును మరచిపోడానికి ప్రయత్నిస్తూ, లోపలికెళ్లి సోఫాలో కూర్చుంది అనసూయ.

టీపాయ్‌పైనున్న పత్రికను యథాలాపంగా చేతికెత్తుకుని వులిక్కిపడింది. దేవుళ్ల ఫోటోలే వున్న భక్తిపత్రికది. అలాంటి పత్రికలే టీపాయ్‌పైన చాలా వున్నాయి.

వంటగదిలోకి తొంగిచూడబోయి, హాలుకటువైపు మూలలో పూజామంటప మొకటి కనిపించగానే ఆమె కలవరపడిపోయింది. మండపం లోపల కొన్ని చిన్న విగ్రహాలూ, దేవుళ్ల ఫోటోలూ వున్నాయి. వొకప్పుడా హాల్లో యేంజెల్సూ, లెనిన్ ఫోటోలూ, అదే టీపాయ్ పైన అన్ని సాహిత్యపత్రికలతోబాటు సృజనా, అరుణతారలూ వుండేవని గుర్తుచేసుకోకుండా వుండలేకపోయిందామె.

అనసూయకు హార్లిక్సు గ్లాసునిచ్చాక, పాపాయిని హాల్లోనే వున్న చీరవూయల్లో వేసి వూపసాగింది వందన.

వూయల గొలుసుల చప్పుడుతోబాటు పాపాయి యేడుపుగూడా ఆగిపోయాక, పూజమండపంలో దీపం వెలిగించి, కర్పూరహారతిచ్చింది వందన.

కర్పూరం వెలుగుతున్న హారతిపళ్లాన్ని అనసూయ ముందుకు చాచింది వందన. యేం చేయాలో తోచక అయోమయంగా పైకిలేచి, అంతలో యేదో స్ఫురించి నట్టుగా, అన్యమనస్కంగానే హారతిని కళ్లకద్దుకుంది అనసూయ.

వందన ముఖంలో చిన్న నవ్వొకటి మెరిసి మాయమైనట్టుగా తోచగానే, "రోజూ పూజ చేస్తావా?" అని అడిగింది ఆమె.

వందన తలూపుతూ "తెల్లారీ, సాయింత్రమూ..." అంది.

"మీ అమ్మా వాళ్లింట్లో నేర్చుకున్నావా?"

యీసారి వందన తల అడ్డంగా వూపి, "మా యజమానుడు నేర్పించిందే," అంది.

అనసూయ వులిక్కిపడి, "యజమానుడా? వాడెవడు?" అని అరచినంత పని చేసింది.

వందన అదోలా కళ్లు చికిలించి, "యజమానుడంటే హజ్బెండు. మావైపు భర్త నట్లే అంటారు," అంది.

"మీదేవూరు?"

"చిత్రదుర్గ. కర్ణాటక..." అంటూ వందన మళ్లీ వంటగదికెళ్లిపోయింది. లోపలి నుంచి పాత్రల శబ్దం పెద్దగా వినబడసాగింది.

యెనిమిది గంటలు దాటాక యింటి ముందు స్కూటరాగింది. లోపలికొచ్చిన యువకుడు హాల్లో కొత్త వ్యక్తి కనిపించగానే ఆగిపోయి, ముఖం చిట్లించాడు.

అతడిలో చిన్నప్పటి పోలికలు వెతుకుతూ, "నువ్వు అనిలే కదా! నేను మీ అమ్మ ఫ్రెండు, అనసూయ. యిరవయ్యేండ్లుకు పైగా అయింది నువ్వు నన్ను చూసి... చిన్నప్పుడు నాతో కేరమ్సు ఆడేవాడివి," అని పరిచయం చేసుకొంది అనసూయ.

అతడామెవైపు కాస్సేపు పరీక్షగా చూసిన తర్వాత, వంటగదిలోకెళ్లాడు. లోపల వాళ్లు మెల్లగా మాట్లాడుకుంటున్నా అతడి గొంతులో విసుగూ, ఆమె గొంతులో గాబరా స్పష్టంగానే వినిపించాయి అనసూయకు.

కాస్సేపటి తర్వాత అతను హాల్లోకొచ్చి, కుర్చీలో కూచుంటూ, "నేను వెంటనే పోల్చుకోలేకపోయాను. యే పనిపైన వచ్చారీవూరు?" అని అడిగాడు ముభావంగా.

"ఆఫీసు పని.. నీకు గుర్తులేదేమో! నేనూ సావిత్రీ క్లాస్‌మేట్లం. సొంతింటికి వచ్చినట్టుగా తరచుగా వచ్చేదాన్నీ యింటికి. అప్పుడీ యిల్లు యిలాగుండేది గాదనుకో..." అంది అంతలో నోరు జారాననుకుని నాలుక్కరచుకుంటూ.

"అంత సులభంగా ఆ యిల్లింత దార్లోకి రాలేదులెండి," అన్నాడతను ముఖం మాడ్చుకుంటూ. "కొంపదీసి మీరు బ్రాహ్మలు గాదుగదా?"

"నాదా! కులమా?" అని గొణిగాక, "నేను మతాన్ని కూడా వదిలేసి చాలా రోజులైపోయింది..." అంది అనసూయ తడబడుతూ.

"నేను దేన్నీ వదలను," అతడి గొంతు గంటలా మోగింది. "మా నాన్నది పలనాటి వీరవిద్యావంతుల కులం. మిగిలిన హరిజనుల్లాగా కాదు మేము. మేం వీరవైష్ణవులం. మానాన్నా, మా తాత మా వారసత్వాన్ని పాడుజేసి పారేశారు. మా పూర్వీకులు వీరగాథలు పాడ్డంలో మొనగాళ్లు. వీరపూజ మా ప్రాణం. యిప్పుడు దాన్నందుకోవాలంటే కష్టంగానే వుంది..." అన్నాడతను పోట్లాడుతున్న ధోరణిలో.

"మీ అమ్మదా కులంగాదు," అని అనసూయ వారించబోయింది.

"ఆ ఫార్వర్డు కులం అహం ఆమెను వదల్లేదందుకే..." అతను విరుచుకు పడ్డాడు.

"మీ నాన్న అదే అనేవాడు... వాళ్లు విడిపోయాక..." అనసూయ సాలోచనగా తల విదిలించింది.

"ఆయనెప్పుడూ కరెక్టే... ప్రాక్టికల్... గాలిలో సాము చేయడు. మీరెప్పుడు కలిశారాయన్ను చివరిసారిగా..."

ఆ సంఘాల్లో సభ్యుడుగావడం చేతనే సత్యనారాయణకు సావిత్రి పరిచయమైంది. అతగాడ్ని పెళ్లి చేసుకోవడం ఆమెకప్పుడెంతో గొప్పగా వుండేది. పెళ్లయ్యాక కూడా యింటికి అతిథిలాగే వచ్చి వెళ్లేవాడతను. యెన్నికలొచ్చినపుడు తననే అభ్యర్థిగా నిలబెట్టమని పార్టీవాళ్లతో పట్టుబట్టాడు. అది కుదరకపోయినప్పుడు యింకో పక్షంలో చేరాడు. పదవులు దొరకలేదుగానీ రాజకీయాల్లో పడిలేచాడు. రెండో పెళ్లి చేసుకున్న తర్వాత సావిత్రినీ, పిల్లల్నీ పట్టించుకోలేదు. మొదటి భార్యకు విడాకులివ్వకుండా యింకో పెళ్లి చేసుకోవడం లీగల్‌గా తప్పని గూడా సావిత్రెప్పుడూ అనలేదు. అతడ్ని కేవలం పట్టించుకోవడం మానేసిందంతే! అటువంటి తండ్రిపైన అనిల్‌కున్న గౌరవాన్ని చూడగానే అనసూయ ఆశ్చర్యపడసాగింది...

“అనితెక్కడుందిప్పుడు,” అని మాటమార్చడానికి ప్రయత్నించింది.

అతను ముఖం తిప్పుకుని, “మీరే హోటల్లో దిగారు?” అంటూ అనిల్ పైకి లేచాడు.

అనసూయ కంగారుగా పైకిలేచి, “యీ వేళప్పుడు ఆటోలు దొరకుతాయా యిక్కడ?” అంది.

“వొకప్పుడైతే శివారుగానీ యిప్పుడిది టౌను మధ్యలోకొచ్చేసింది. అర్ధరాత్రి గూడా ఆటో దొరుకుతుంది,” అన్నాడతను వరండాలోకి నడుస్తూ...

వరండాలోని తన యెయిర్‌బాగ్ తీసుకుని చకచకా ప్రహరీ దాటింది అనసూయ. వెనకనుంచి అనిల్ చూపులు తననింకా గుచ్చుతున్నట్టుగా అనిపించడం తో మరింత వేగంగా అడుగులేసింది. అరకిలోమీటరు నడచాక ఆటో యెక్కి రైల్వే స్టేషను కెళ్లింది. ప్లాట్‌ఫాం పైన యాత్రికుల మధ్యలో పడుకుని నిద్రపోయింది. మరునాడు స్టేషను బాత్రూంలోనే స్నానం చేసింది. వోల్డేజీ హోంకు ఫోనుచేసి అనిత చిరునామా సంపాదించుకుంది. ఆటోలో ఆ ప్రాంతానికెళ్లి, పదకొండు గంటల ప్రాంతంలో అయిదంతస్తుల గృహసముదాయంలోని నాలుగో అంతస్తు ఫ్లాట్ ముందున్న కాలింగ్‌బెల్ నొక్కింది.

తలుపులు తెరిచిన యువతిని చూసి, “సారీ! నిద్రలేపినట్టున్నాను. నేను అనసూయ. సావిత్రి బాల్యస్నేహితురాల్ని,” అంది.

అనిత పక్కకు జరిగింది లోపలికి రమ్మన్నట్టుగా.

సన్నటి వరండాలో వున్న కాస్త స్థలంలో రకరకాల చెప్పులూ, రకరకాల సైజుల బూట్లూ వున్నాయి. హాల్లో పెద్ద సోఫా, యెదురుగా ప్లాస్మా టీవీ, మూలల్లో యిండోర్ మొక్కలు, పలచటిరంగుతో మెరుస్తున్న గోడలకు మాడరన్ పెయింటింగ్ పటాలూ... కిటికీలకు రంగుతెరలూ...

“కూచోండి... రాత్రి లేటుగా పడుకున్నా... ముఖం కడుక్కునొస్తాను,” అంది అనిత లోపలికెళ్తూ.

సోఫాలో కూర్చుని టీపాయ్‌పైని పత్రికలు తిప్పసాగిందామె. డెబొనైర్... వోగ్... ఫెమినా...

“బ్లాక్‌కాఫీ అలవాటేనా ఆంటీ!” అంటూ వో కప్పు అనసూయకిచ్చి, తన కాఫీ కప్పును చేతబట్టుకుని యెదురుగా కుర్చీలో కూర్చుంది అనిత.

కాఫీ తాగుతూ, “నేనూ సావిత్రీ వొకే స్కూల్లో చదివాం. వుద్యోగమొచ్చి మీ అమ్మ యీ వూరొచ్చేశాకగూడా నేను చాలాసార్లొచ్చాను మీ యింటికి... అప్పుడు నువ్వు చాలా చిన్నదానివి. నన్ను మీ అన్నే పోల్చుకోలేకపోయాడు,” అంది ఆమె.

“అక్కడికి వెళ్లొస్తున్నారా? వాడు ఉన్నాడా ఇంట్లో?” అంది అనిత చివాలున తల పైకెత్తి కోపంగా.

అనసూయ తలూపింది.

“మీరెళ్లినప్పుడు ధ్యానంలో వున్నాడా, లేకపోతే తపస్సా?” అడిగిందామె వ్యంగ్యంగా.

“గుడికెళ్లాడంది భార్య. తర్వాత వచ్చాడు.”

“ఆ యిల్లంతా తనదేనన్నాడా మీతోగూడా?”

అనసూయ అయోమయంగా చూసి, “నేనక్కడున్నది కాస్సేపే! వున్నంతసేపూ పలనాడూ, వైష్ణవులూ, పూజలూ అన్నాడేవేవో...” అంది.

“వాడో పెద్ద యెంసీపీ... ఆస్తంతా మగాళ్లదేనంటాడు. ఆడవాళ్లకు వాటా యివ్వడమే తప్పంటాడు. కులాల మూలసూత్రాలేవో వున్నాయిట. అది తెలుసు కోకపోతే ముందుకెళ్లలేమంటాడు. వాడే యెక్కడో స్టక్కయిపోయానని వాడికే తెలియదు.”

“అది మీ అమ్మ యిల్లు. నీ వాటాకోసం కోర్టుకెళ్లొచ్చు...”

“వెళ్లకుండా వుంటానా? సొంత ఆస్తే వుండగూడదంటారుగదా మీరంతా, యిక యిది నీ యిల్లని యెలాగంటావని అమ్మపైనే తిరగబడ్డాడు వాడు. ఆమె కిమ్మన కుండా యిల్లొదిలిపెట్టి వెళ్లిపోయింది. మరి నా వాటా సంగతేమిటంటే జవాబు చెప్పడు. కోర్టుకెళ్తానని చెప్పే వెళ్లాను. దానికీ మౌనమే.”

“ఫ్లాటు బావుంది. మీ ఆయనేం చేస్తాడు,” అని అడిగింది అనసూయ ప్రసక్తిని మార్చడంకోసం.

“యిది నేను కొనుకున్న ఫ్లాటు. నేను డైవోర్సీ,” అంది అనిత నిక్కచ్చిగా. తర్వాత, “అమ్మ మీ గురించెప్పుడూ చెప్పలేదు. యీ వూరికేదైనా పనిపైన వచ్చారా?” అని అడిగింది.

అనసూయ అదోలా తల వూపి, “చాలారోజులపాటు నేనిక్కడలేను. పోయిన సంవత్సరమే రమ్మంది మీ అమ్మ. కుదర్లేదు. యిప్పుడు మీ అమ్మేమో హాస్పిటల్లో...” అంది డగ్గుత్తికతో.

“అంతా స్వయంకృతాపరాధం. వెర్టిగో వుందని వద్దన్నా వినకుండా వెళ్లింది. ఆటో గుద్దేసింది. అవసరమైన వాటిలో పట్టింపు వుండదు. అనవసరమైనవైతే వద్దన్నా వినదు... నాన్నలా చేసినా కోప్పడదు. ఆయినకేదో రోగమొచ్చి పోయాడుగానీ, ఆయి నప్పుడు వచ్చినా కాదని వుండదు. కొడుకునైనా అదుపులో పెట్టలేదు. వాడే వెతికి వెతికీ ఆ పెళ్లి చేసుకున్నాడు. దానికీ యేమనదు. ఆడపిల్లనని నాకు మాత్రం అన్నిటికీ హద్దులు పెడుతుంది. నేను పెళ్లి చేసుకుంటానంటే కులమూ, మతమూ అని గొడవ

చేసింది. వాడు మంచోడుగాదని డైవోర్సుకెళ్తే వద్దంటూ అడ్డంపడింది. అంతా పాసివ్‌గా, యేం జరిగినా సరేనంటూ...''

అనసూయ పెద్దగా నిట్టూర్చాక, ''నీదేం వుద్యోగం,'' అని వాకబు చేసింది.

''జాబ్‌గాదు. యెన్జీవో... స్లమ్సులో వుండే డైవోర్సీలూ, ఆర్ఫన్ల ప్రాబ్లమ్స్ డీల్ చేస్తాం... యెంత చేసినా తెమలనంత పని. యిరవై నాలుగ్గంటలూ సరిపోదు. పన్నెండుకు మీటింగు. యీసరికి అక్కడుండాల్సింది. లేటయిపోయింది,'' మాట్లాడు తూనే పైకిలేచి వరండాలోకొచ్చేసింది అనిత.

బాగ్ తగిలించుకుని గబగబా తానూ బయటికొచ్చేసింది అనసూయ. ఆమె లిఫ్టు ముందుండగానే అనిత తలుపులు వేసుకున్న శబ్దం వినిపించింది.

మధ్యాహ్నం హోటల్లో భోంచేసి, బస్టాండులో కాస్సేపు విశ్రాంతి తీసుకుని, సాయంకాలం మరేమీ తోచకపోవడంతో మళ్లీ హాస్పిటల్ కెళ్లింది అనసూయ.

వెయిటింగ్ రూంలో అనిల్, అనితా చెరోవైపు దూరంగా కనిపించగానే కంగారు పడుతూ యెంక్వయిరీకి పరిగెత్తింది. పాత నర్సు పలకరిస్తున్నట్టుగా నవ్వి, ''మేడం మధ్యానం స్పృహవచ్చి దొర్లినట్టుగా అనిపించింది. కొడుకూ, కూతురూ పత్రాలతో బాటూ పరిగెత్తుకొచ్చారు,'' అంది.

వార్డు గదిలో పడకపైనున్న సావిత్రి శరీరంలో అనసూయకేమీ మార్పు కనిపించలేదు.

అనసూయ నెమ్మదిగా అనిల్ పక్కకుర్చీలోకొచ్చి కూర్చుని, ''సావిత్రికి స్మారక మొస్తే యింటికి తీసుకెళ్తావా?'' అని అడిగింది.

అనిల్ ఆవిడకేసి తల కూడా తిప్పకుండా, ''యిదివరకే బలవంతంగా తీసుకెళ్లా నొకసారి. నేనూ నా భార్య బ్రహ్మముహూర్తంలో లేస్తాము. యోగా, ధ్యానం చేస్తాం. పూజ రెండుగంటలైనా వుంటుంది... ఆఫీసుకెళ్లే రోజుల్లో కూడా తొమ్మిదిలోపల లేవ లేదామె యెప్పుడూ... ఆమెకూ మా డిసిప్లెయిన్‌కూ కుదర్లేదు... పారిపోయింది రెండు రోజులకే...'' అన్నాడు. కాస్సేపాగి, ''అందరు తల్లులలాంటిదిగాదు మా అమ్మ. యేం చదువుతున్నావు, తిన్నావా లేదా? అని కూడా నన్నెపుడూ పట్టించుకోలేదు. వార్డెను లాగా, అదేదో యిష్టంలేని బాధ్యతగా, అంటీముట్టనట్టుగా...'' అన్నాడు కచ్చిగా.

అయిదు నిముషాలు మౌనంగా వున్న తర్వాత, ''నువ్వు పుట్టినప్పుడు జరిగిన సంగతి,'' అంది అనసూయ మెల్లగా. ''ఆరేడు నెలలదాకా సావిత్రికి సరిగ్గా నిద్రపట్టేది గాదు. రాత్రీపగలూ నిద్రరాక దొర్లేది. పోస్ట్‌పార్టమ్ యిన్‌సామ్నియా అన్నారు డాక్టర్లు. చాలామందికలా కానుపయ్యాక డిప్రెషనూ, యాంగ్జయిటీ మామూలేనన్నారు. అప్పటికే మీ నాన్న రాకపోకలు తగ్గాయి. మీ అమ్మ కాఫీకెంత అడిక్టో నీకు తెలిసే వుండాలి. డాక్టర్లు కాఫీని పూర్తిగా రూలవుట్ చేసేశారు. పడగ్గదిలో లైటుండకూడ దన్నారు. బిడ్డెప్పుడు నిద్రపోతే అప్పుడే నిద్రపోవాలనీ, బిడ్డ మేలుకున్నపుడే మేలుకోవా

లనీ చెప్పారు. పడుకుని బ్రీతింగ్ యెక్సర్‌సైజులు చెయ్యమన్నారు. చివరకు సైకియాట్రిస్టును కలవమన్నారు. యేవేవో మందులిచ్చి, వాటిని వాడకుండా నిద్రపొయ్యే ప్రయత్నం చెయ్యమన్నారు..''

అనిల్ ముఖంలో చెమటలు పుట్టాయి. అతడి పెదవులు వణకసాగాయి. చాలాసేపటి తర్వాత గొంతు పెగుల్చుకుని, ''నాకు తెలియదు. అమ్మగూడా చెప్ప లేదెప్పుడూ...'' అన్నాడు బొంగురుపోయిన గొంతుతో.

''తర్వాత నేను ఆ ప్రసక్తి తీసుకొస్తే అదంతా ఫిజికల్ సమస్యలేనంది సావిత్రి. అనిత పుట్టాక అలా జరగలేదు గూడా! యిందులో సెంటిమెంటల్‌గా చూడాల్సిందేమీ లేదంది!'' అన్నాక పైకిలేచి, తిరిగైనా చూడకుండా అనిత దగ్గరికొచ్చి కూర్చుంది అనసూయ.

''బాండులో సంతకం చేయించుకునే వరకూ కట్టు కదలనంటున్నాడా వాడు?'' అని అడిగింది అనిత కోపంగా.

''మీ అమ్మకు స్మారకమొస్తే మీ యింటికి తీసుకెళ్తావా అనితా,'' అంటూ అనసూయ అదే ప్రశ్నను సంధించింది.

''ఆమెకూ మా యింటికీ కుదరదులే ఆంటీ? యిల్లంటే తలదాచుకునే తావు మాత్రమే గాదు. వైబ్రెంట్‌గా వుండాలి. ఫ్రెండ్సూ, మీటింగులూ, డిస్కషన్లూ, హాట్ హాట్‌గా వుంటుంది మా యిల్లెప్పుడూ. పెద్దపెద్దవాళ్లంతా వస్తారు. మా అమ్మలా పాసివ్‌గా, నిర్లిప్తంగా వుండేవాళ్లు అక్కడుండలేరు,'' అంది అనిత.

అనసూయ పెద్దగా నిట్టూర్చాక, ''నీకూ మీ అన్నకూ అయిదేళ్లొచ్చేదాకా మీ అమ్మ వొకేరకం బట్టలేసేది. యెవరు అబ్బాయో, యెవరు అమ్మాయో తెలిసేది గాదు,'' అంది. ''కొన్నేళ్ల తర్వాత నువ్వే గౌన్లూ, పావడలూ కావాలని యేడుస్తున్నావనీ, నీ గొడవ భరించలేకే ఆడపిల్లల డ్రస్సులు తెచ్చిస్తున్నాననీ అంది సావిత్రి. యిప్పుడు గూడా నీకు ఆ మాడర్న్ డ్రస్సులపైనా, ఫాషన్లపైనా మోజు తగ్గలేదు. నీ తప్పేమీలేదు. నీలాగే నేనూ సావిత్రి పాసివ్ అనీ స్టాటిక్ అనీ అనుకున్నాను చాలారోజుల పాటు...'' మాట్లాడుతూనే పైకిలేచి, హాస్పిటల్ నుంచి బయటికొచ్చి నేరుగా వోల్డేజీ హోంకొచ్చే సింది అనసూయ.

ఆఫీసులోని ముసలి మేనేజరు సులభంగానే గుర్తుపట్టాడు. ''మేడం చాలా సార్లు చెప్పారు మీరొస్తారని.. మీకోసం చాలాసార్లు రూం గూడా రిజర్వు చేశామప్పుడు,'' అంటూ లెడ్జరు పుస్తకం తెరచి, ''మీ పిల్లల పేర్లూ, అడ్రస్సులూ చెప్పండి. తర్వాత అవసరం గావచ్చు. రికార్డు చేసుకోవాలి,'' అన్నాడు.

''నేను వొంటరిని. యెవరూ లేరు...''

''పోనీ మీరు చేస్తూండిన వుద్యోగం, ఆ అడ్రస్సు...''

“సావిత్రి చెప్పలేదా మీకు! పాతికేళ్లకుపైగా బయటి ప్రపంచంలో లేను నేను. ఆరునెలల క్రితమే బయటికొచ్చాను. జనజీవన స్రవంతిలోకి అంటూ యేవేవో అన్నారందరూ. నా ఖర్చు కూడా తానే భరిస్తానంది సావిత్రి. యిప్పుడామే కోమాలో వుంది. యింకా పనిచేసే శక్తుంది నాకు. యిక్కడ మీరేం పని చెప్పినా చేస్తాను.”

ముసలాయన కాస్సేపాలోచించాక, “మీరు మేడం రూంకెళ్లండి. నేను బోర్డుతో మాట్లాడి చూస్తాను,” అన్నాడు.

చిన్న మంచం. పరుపుపైన వుతికిన శాలువా. రెండు దుప్పట్లు. తెల్లటి తలగడా. మూల చిన్న సూట్‌కేసు. గదిగూడా సావిత్రిలాగే నిరాడంబరంగా వుంది.

సూట్‌కేసు లోపల రెండు మూడు చీరలు, జాకెట్లూ, మరికొన్ని బట్టలు. కమ్యూనిష్టు మానిఫెస్టో పాత ప్రతి వొకటి. చిన్న దంతపుపెట్టె. చిన్నప్పటి నుంచీ ఆ దంతపుపెట్టెను సావిత్రి అంత జాగ్రత్తగా దాచుకోవడం చూసి అనసూయ ఆశ్చర్యపడి పోయింది.


పెట్టెను తెరిచి చూసింది అనసూయ. రెండు పార్టీలకూ విడవకుండా కడుతున్న సభ్యత్వ రశీదులు.

‘పార్టీ రెండుగా చీలడం బాలేదు. మళ్లీ కలిసి, మరో మంచిమార్గంలో...’ అని సావిత్రి అనడం అనసూయకు గుర్తుకొచ్చింది.

పాతబడినా శుభ్రంగా వున్న ఆ గదిని ప్రేమగా, గౌరవంగా కలయజూసింది అనసూయ.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*30 జూన్ 2019*

*



16 జులై 1957న పుట్టిన **మధురాంతకం నరేంద్ర** మొదటి కథ ***చివరికి దొరికిన జవాబు*** 1975లో ఎస్.వి. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి మేగజైన్‌లో అచ్చయ్యింది. *కుంభమేళా, అస్తిత్వానికి అటూ-ఇటూ, రెండేళ్ల పధ్నాలుగు, నాలుగుకాళ్ల మంటపం* కథాసంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. *కథావార్షిక*కు సహ సంపాదకులు. *తాత్త్విక కథలు* సంకలనానికి సంపాదకులు. ఆటా నవలల పోటీలో వీరి *మనోధర్మపరాగం* నవలకు మొదటి బహుమతి లభించింది. ఎస్.వి. యూనివర్సిటీలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు.

***చిరునామా: 15-54/1, శ్రీ పద్మావతీ నగర్, తిరుపతి - 517 502***
***ఫోన్: 98662 43659*** *manarendra@gmail.com*